"చెన్నైకి." జవాబు చెప్పాడు సన్యాసి.

"అక్కడ ఎవరున్నారు?"

"మైలాపూర్‌లో కపాలేశ్వర స్వామి, వడపళనిలో సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయాలు చూడటానికి."

"టిక్కెట్ లేకుండా టాయ్‌లెట్ పక్కన తడిలో పడుక్కుని అంతదూరం ప్రయాణించడం అనవసరపు శ్రమ కాదా?"

సన్యాసి చిన్నగా నవ్వి ఆ ప్రశ్నకి ఇలా జవాబు చెప్పాడు.

"వేసవి శెలవలకి మీరు మీ కుటుంబ సభ్యులతో, బరువైన పెట్టెలతో, కిక్కిరిసిన రైళ్ళల్లో ఎందుకు ప్రయాణం చేస్తున్నారు? మీరు ప్రేమించేవారితో గడపాలనేగా అంత శ్రమ పడేది? అలాగే నేనూ అంతలా ప్రేమించే దేవుడి దగ్గరకి ఎంతటి శ్రమనైనా ఓర్చి వెళ్తూంటాను."

ఆ ప్రయాణీకుడికి రైళ్ళల్లో టి.సి.లు దింపేస్తున్నా ఇంకో రైలెక్కి ప్రయాణించే సాధువుల ప్రయాణం వెనక గల భక్తి అర్ధమైంది.

## 195. ధన్యుడు

ఓ గ్రామంలో రంగడు, రాజు అనే ఇద్దరు మిత్రులున్నారు. ఇద్దరికీ సమానమైన దైవ భక్తి ఉంది. రంగడు నిత్యం దైవ ప్రార్ధన చేస్తూ, తనకి ఏం కావాలో దేవుడ్ని కోరుకుంటాడు.

తన భార్య ఆరోగ్యం కుదుట పడాలని ఉదయం కోరుకుంటే రాత్రికల్లా ఆవిడ సంపూర్ణ ఆరోగ్యవంతురాలు అవుతుంది. ఇలా అతను దేవుడ్ని అడగని కోరికలేదు. దాన్ని దేవుడు తీర్చని కోరిక లేదు.

రాజు విషయం ఇందుకు పూర్తిగా విరుద్ధం. అతను దేవుడ్ని పూజిస్తాడు కాని ఏ కోరికా కోరడు. కోరడానికి అతనికి ఒక్క కోరికా లేదు.

ఆ ఊరిమీంచి వెళ్తున్న ఓ జ్ఞానిని రాముడు, రాజు కలుసుకున్నారు.

"స్వామీ! నేను కోరిందల్లా దేవుడు తీరుస్తున్నాడు. నా మిత్రుడు రాజు ఒక్క కోరికా కోరడు. మా ఇద్దరిలో ఎవరు అధికం అన్న మీమాంస నన్ను చాలాకాలంగా పీడిస్తోంది. మీరు తేల్చి చెప్పండి." రాముడు అడిగాడు.

"మీ ఇద్దరూ ఎక్కువ, తక్కువ తేడాల్లేకుండా సమాన స్థాయివారు. కాకపోతే కోరిక ఉండి అది తీరేవాడికన్నా, అసలే కోరికా లేనివాడు నిజంగా ధన్యుడు." జవాబు చెప్పాడా జ్ఞాని.

## 196. భగవంతుడు ఎవరు?

"భగవంతుడంటే ఎవరు?" అడిగాడు ఒకడు ఓ తత్త్వవేత్తని.

ఆ తాత్త్వికుడు బదులు చెప్పలేదు.

"భగవంతుడంటే ఎవరు స్వామీ?" మళ్ళీ అడిగాడతను.

ఈసారీ బదులు చెప్పలేదా తాత్త్వికుడు.

మూడోసారి అతనడిగాక జవాబు చెప్పాడాయన.

"నీ ప్రశ్నలకి జవాబు చెప్పినా మళ్ళీ అదే ప్రశ్న వేస్తావే? మౌనమే భగవంతుడు."

## 197. సజ్జనుడు

"నాయనా నువ్వు ధర్మ ప్రవచనం చేస్తున్న సమయంలో ఎవరైనా తిడితే ఏం చేస్తావు?"

"కొట్టనందుకు సంతోషిస్తాను."

"కొట్టారనుకో."

"చంపనందుకు సంతోషిస్తాను."

"ఒకవేళ చంపితే?"

"ఓ ధర్మ కార్య నిర్వహణలో ప్రాణం పోయినా ఫర్వాలేదు."

ఇలాంటివారే ధర్మ ప్రచారానికి తిరుగులేని మనుషులు.